ఆంధ్రజ్యోతి ప్రవాస

# యూఎస్ కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తికి ఘన సన్మానం




డాలస్: యూఎస్ కాంగ్రెస్ మెంబర్ రాజా కృష్ణమూర్తికి డాలస్‌లో ఘన సన్మానం జరిగింది. ఏప్రిల్ 29న టచ్ నైన్ రెస్టారెంట్‌లో తోటకూర ప్రసాద్ నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో వందలాది మంది ఎన్నారైలు పాల్గొన్నారు. యూఎస్ కాంగ్రెస్‌కు పోటీ చేయడానికి రాజా కృష్ణమూర్తి అభ్యర్థిత్వాన్ని ప్రకటించగానే డాలస్‌లో ఉన్న పాల్ పాండియన్, ప్రసాద్ తోటకూర, ఎంవీఎల్ ప్రసాద్, సి.సి. థియోఫిన్, శ్రీధర్ తుమ్మల భారీ విరాళాలు సేకరించారు. తద్వారా రాజా కృష్ణమూర్తి ఎన్నికకు ఎంతో కృషి చేశారు. రాజా కృష్ణమూర్తిని ప్రసాద్ తోటకూర సభకు పరిచయం చేశారు. ఆయన చాలా భాద్యత గల సభ్యుడని, అవసరమైన అన్ని సందర్భాల్లోనూ కాంగ్రెస్‌లో తన గళాన్ని వినిపిస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో ముందంజలో ఉంటారని తెలిపారు.

ఉద్యోగాలను సృష్టించడం ద్వారా మన ఆర్ధికవ్యవస్థను వృద్ధి చేయడం, వర్కింగ్ ఫ్యామిలీస్ కోసం అండగా నిలబడడం, మహిళలకు సహాయ పడటం, ఒబామా "ఎఫోర్డబుల్ కేర్ యాక్ట్" ను సమర్ధించడం, సీనియర్స్ కు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టడం, దేశ భద్రతను కాపాడటం, యుద్ధాల్లో పోరాడిన సైనికులను గౌరవించడం వంటి వాగ్దానాలను రాజా కృష్ణమూర్తి తన ఎన్నికల ప్రచారంలో ఇచ్చారని ప్రసాద్ తోటకూర గుర్తు చేశారు. ప్రస్తుతం విద్య, ఉద్యోగుల కమిటీ, పర్యవేక్షణ, ప్రభుత్వ సంస్కరణల కమిటీల్లో ఆయన సభ్యుడిగా పని చేస్తున్నారని అన్నారు.

అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ఒబామా "ఎఫోర్డబుల్ కేర్ యాక్ట్" ను తొలగించాలని ప్రయత్నాలు చేసినప్పుడు, దాన్ని వ్యతిరేకిస్తూ రాజా ధృడంగా నిలబడ్డారని, ఇటీవల అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఏడు ముస్లిం దేశాల వ్యక్తులను అమెరికా దేశంలోకి ప్రవేశాన్ని నిషేధించినప్పుడు దాన్ని రాజా తీవ్రంగా వ్యతిరేకించారని అన్నారు. ఇదే సందర్భంలో చికాగో ఓహేర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొంతమంది ముస్లిం దేశస్తులను ఇమ్మిగ్రేషన్ అధికారులు ప్రవేశాన్ని అడ్డుకున్నారనే విషయాన్నీ తెలుసుకుని, హుటాహుటిన విమానాశ్రయానికి చేరుకొని అక్కడ అధికారుల మీద ఆగ్రహం వ్యక్తం చేసి, ప్రదర్శన చేస్తున్న ప్రజలకు మద్దతు తెలుపడం ద్వారా రాజా ప్రజల మనిషిగా నిరూపించుకున్నారని అన్నారు. భారత సంతతికి చెందిన రాజా కృష్ణమూర్తి కాంగ్రెస్ కు ఎన్నిక కావడానికి సహకరించిన డాలస్ మిత్రులందరికీ తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, రాజా ముమ్ముందు అమెరికా రాజకీయాల్లో ఒక తిరుగులేని రాజకీయ శక్తిగాఎదుగుతారని డాక్టర్ తోటకూర ఆకాంక్షించారు.

రాజా కృష్ణమూర్తి తన ప్రసంగంలో భారతీయ అమెరికన్లకు చాలా ఓర్పు గల వారని, వాళ్ళు అవసరమైనప్పుడు తమ హక్కులను కాపాడుకోవటం కోసం తమ గళాన్ని ఐకమత్యంతో వినిపించాలని చెప్పారు. లేకుంటే అమెరికా జన జీవన స్రవంతిలో వెనుక బడిపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. సభకు హాజరైన సభ్యులు ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన ప్రశ్నలకు జవాబు ఇస్తూ మనమందరం కొంత సమయం కేటాయించి అమెరికా పార్లమెంట్‌ను సందర్శించాలని, అక్కడి కార్యకలాపాలు, కాంగ్రెస్ ఎలా పని చేస్తుందో తెలుసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు.

డాలస్ ఆహ్వాన సంఘం, మద్దతుదారులు రాజా కృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు, నిర్వాహకులలో ఒకరైన ఎంవీఎల్ ప్రసాద్.. రాజా కృష్ణమూర్తికి పూల దండ వేయగా, డాక్టర్ ప్రసాద్ తోటకూర, సి.సి. థియోఫిన్... రాజాకు శాలువా కప్పి, ఓ జ్ఞాపిక ను బహుకరించారు. రాజా కేక్ కట్ చేసి తన సంతోషాన్ని అందరితో పంచుకున్నారు. సి.సి. థియోఫిన్ తన వందన సమర్పణ లో ఎంతో ఆప్యాయంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని డాలస్ నగరాన్ని విచ్చేసి, తన మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలియజేసిన రాజా కృష్ణమూర్తి కి , ఎంతో ప్రోత్సాహం ఇస్తున్న డాలస్ మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.